ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 26, 2003

గణతంత్రానికి గండాలు

హ్యాపీ బర్త్‌డే

(26-1-2003 నుండి 1-2-2003 వరకు)

పి.ఝాన్సీ
2సం॥, 26. 1. 2001
మంజుల- రాములు
లింగంపల్లి-రంగారెడ్డి

సాయిప్రదీప్
10స॥, 26.1.1993
నాగరత్నం-కృష్ణకిషోర్
వీరవాసరం-ప॥గో॥

ఎంఎస్ ఆజాద్
4సం॥,26. 1. 1999
సునీత-ఎమ్‌వై పాషా
ఇల్లెందు- ఖమ్మం

సాయికుమార్ రెడ్డి
4సం॥, 26. 1. 1999
లక్ష్మి-నారాయణ్ రెడ్డి
ఏన్కతల

డి. అనిల్ కుమార్
1సం॥, 26.1.2002
జోత్స్నకుమారి-దేవకుమార్
తాడేపల్లి-గుంటూరు

మనీష
జనవరి -26
గీత- రాము
బేగంపేట్- హైదరాబాద్

జె. మానస
7సం॥, 28.1.1996
అరుణ- విజయ్‌కుమార్
రాంనగర్- హైదరాబాద్

శ్రావ్య(మిన్ను)
5సం॥, 28.1.1998
రాధ- బుచ్చిరెడ్డి
హైదరాబాద్



దొండపాటి అనిల్
6సం॥, 28. 1. 1997
నాగమణి- నాగేశ్వరరావు
రావినూతల- ఖమ్మం

కొప్పుల రమాదేవి
9సం॥, 29. 1. 1994
జానకి- వెంకటరామయ్య
నేలకొండపల్లి-ఖమ్మం

కె. విజయ్ సాయిఫణీంద్ర
8సం॥, 31.1.1995
అన్నపూర్ణేశ్వరి- శ్రీనివాసరావు
భీమవరం- ప॥గో॥

ఆలేటి భరత్
8సం॥, 31.1.1995
సుజాత- వెంకటేశ్వరరావు
కృష్ణలంక- విజయవాడ

...క్కలు కలపండి



కలం స్నేహం

...అశోక్‌కుమార్
...: 14 సం॥
... 9వ తరగతి
...దీపిక పుస్తకాలు చదవడం, బొమ్మలు
... క్రికెట్ ఆడడం, పేపరు చదవడం.
...రునామా : వి.అశోక్‌కుమార్, సన్నాఫ్ వి.శేఖరయ్య
..., మునుగాల, ఇటిక్యాల, మహబూబ్‌నగర్.

పేరు: సాదియా
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి,
హాబీలు: బొమ్మలు వేయడం, టీవీ చూడడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : సాదియా, డాటరాఫ్ జాని, అయిటిపాముల, కటంగూర్, నల్లగొండ.

భోషాణం పెట్టె - దొంగలు



ఓసారి నసీరుద్దీన్ గారింట్లోకి నలుగురు దొంగలు ప్రవేశించారు. అది నసీరుద్దీన్ గమనించాడు. ఏం చెయ్యాలా అని ఓ క్షణం ఆలోచించాడు. ఆయనకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఈలోగా దొంగలు ఇల్లంతా వెతుకుతున్నారు. వాళ్లకు విలువైన వస్తువులేం కనిపించలా. 'ఛ! ఇక్కడకు రావడమే వేస్ట్‌లాగుందే' అనుకుని తిరిగి వెళ్లబోతున్నారు. ఈలోగా వారికి ఓ పెద్ద భోషాణం కనిపించింది. అంతే ఆ నలుగురు దొంగల కళ్లూ తళుక్కున మెరిశాయి. 'ఆ... నసీరుద్దీన్ ఖచ్చితంగా తన దగ్గర వున్న డబ్బంతా ఇక్కడే దాచిపెట్టి వుంటాడు. పదండి తీసుకు వెళదాం' అనుకున్నారు మెల్లగా. గబగబా భోషాణం పెట్టె దగ్గరకెళ్లి మూత తీశారు ఆశగా. అంతే లోపల కనిపించిన దృశ్యం చూసి నోళ్లు తెరిచారు నలుగురూ. తర్వాత తేరుకుని 'నసీరుద్దీన్! యేం చేస్తున్నావ్ ఇక్కడ?' అనడిగారు ఆశ్చర్యంగా. దానికి నసీరుద్దీన్ వినయంగా 'క్షమించాలి. మా ఇంట్లో విలువైన వస్తువులేవీ లేవని తెలుసుకాబట్టి ముఖం చెల్లక యీ భోషాణంలో దాక్కున్నాను' అన్నాడు. చేసేది లేక దొంగలు తిరుగు దారి పట్టారు.

పదాల పదనిసలు

ఎవ	?
అ	
ఘా	
క్లవ	

ఈ ఇంగ్లీషు మాటలకు పూర్తి అర్థం రావాలంటే రెండు అక్షరాలు రాస్తే చాలు. ప్రయత్నించండి. తెలియక పోతే వచ్చేవారం వరకు వేచి వుం...డా...ల్సిం...దే.

గో	వు
రే	
చా	
షా	
రా	

చక్రం తిప్పితే...

హాయ్...

పక్కన ఓ చక్రం వుందికదా. ఒక మంత్రం వేస్తే అందులో కాంతి కిరణం కదులుతున్నట్టు చేయొచ్చు. గిరగిరా తిప్పి చక్కని వలయాలు తిరుగుతున్నట్టు చేయొచ్చు. ఆ మంత్రం ఏంటో చెప్పనా... చెప్తాకానీ... ముందు నాతో మాట చెప్పండి. 'బాలనేస్తాలు' పేజీ అంతా చదువుతున్నారా? మీకిష్టమైన శీర్షికలలో పాల్గొంటున్నారా? అలా చేస్తానంటేనే మంత్రం చెప్తా... చెప్పనామరి. అబ్రకదబ్రా... చక్రం దబ్రా... కిరణం దబ్రా...వలయం దబ్రా. అంతే... ఈ మంత్రం చదివాకే బొమ్మను కదిలించండే!



ప్రపంచ పోలీస్

రుక్మిణి

గాఢాంధ 'ప్రపంచం' లో 'అంధదేశం' ఒకటి! ఆ దేశ ప్రభువు మిక్కిలి సంపన్నుడూ.. మిక్కిలి బలశాలీ.. అందునా తరతరాలుగా వారి వారసులు ప్రపంచంలోని ఎన్నో దేశాలను జయించి కొల్లగొట్టి – లొంగదీసుకుని బోలెడంత సంపదను పోగుచేసి ఉంచారు. క్రమంగా అది తొండ ముదిరి వూసరవెల్లిగా మారినట్లు బలిసిపోయింది. బాగా బలిసి పోవడంతో తగు మోతాదు కండా.. అంతకు మిక్కుటంగా కావరమూ కూడా ఎక్కడం వల్లనూ కన్నూ మిన్నూ కానరాని విధంగా మారిపోయింది.

అంధరాజుకు అధికార దాహం ఎక్కువ. ధనదాహం మరీ ఎక్కువ. అంచేత క్రమంగా దేశాల మీద పడి యుద్ధాలు చేసి ఆక్రమించుకునే మొరటు పద్ధతులను కాసేపు పక్కన పెట్టి తన వ్యాపారం జోరుగా సాగే అనేక రకాల పథకాలను కూడా అమలులో పెట్టి దోచుకో సాగాడు. ఆ పథకాల అంతు అంతంతమాత్రాన ఎవడికీ బుర్రకు పట్టని విధంగా కూడా ఉండేవి. అయితే దోపిడీ మాత్రం యధేచ్ఛగా సాగుతూ ఆ దేశపు ఖజానా ఫెళఫెళలాడి నిండి పోతూ ఉంటే ఆయనగారు ఉబ్బితబ్బిబ్బులై పోయేవాడు.

అంధ దేశానికి చాలా మంది లొంగుబాటు తాబేదార్లు.. అక్కడక్కడ చిన్న సంఖ్యలో ధైర్యంగా ఎదురొడ్డి నిలిచే దేశాలు కూడా ఉన్నాయి! వాటి నెట్లా లొంగదీసుకోవాలనే తపన ఎల్లప్పుడూ తహతహలాడించేది! అంధరాజుగారితో వైరానికి అందరూ జంకేవారు. కారణం వారికి మిక్కిలి బలమైన ఆయుధ సంపత్తీ.. సైన్యం.. పటాటోపం ఉండడం చేత కిక్కురుమనకుండా మిన్నకుండి పోయేవారు.

ఒకరోజు కొవ్వు పట్టిన పందిమాంసం కరకరా నములుతుండగా వారికో ఆలోచన వచ్చింది. వెంటనే అన్ని దేశాల వారికీ ఒక ఆర్డరు జారీ చేశారు. "ఇకముందు ఏ రాజూ తమ దేశంలో పందులూ.. కోళ్ళూ.. మేకలూ.. బాతులూ, గొర్రెలు అసలు ఆహారానికి పనికి వచ్చే జంతువులను పెంచనే కూడదు. అట్లా పెంచి భుజించిన వారు శిక్షార్హులూ.. దండనకు గురికాగలరూ" అని దాని సారాంశం.

దాంతో ఒక సీనియరు మంత్రి నివ్వెరపడి నిటారుగా నిక్కినీల్గి "అంటే మిగిలిన దేశాల ప్రజలందరూ వెజిటేరియన్లుగా మారిపోతే మనకేం లాభం! అసలు వాళ్ళు ఒప్పుకుంటారా?" అని అడిగాడు.

"నాన్సెన్స్! వాళ్ళను వెజిటేరియన్‌గా ఉండమని ఎవడు మిడికాడు? చచ్చు ఆలోచన! తినబుద్ధి పుట్టిన వాళ్ళు మనదేశం నుండి కొనుక్కుని హాయిగా ఫ్రై చేసుకునో.. ఉడకేసుకునో నాకుతారు. మధ్యలో నీకేంటి?" అని హుంకరించాడు.

"అద్సరే.. మరి మనమూ వాటిని పెంచుకుంటున్నాం – ఫార్మ్‌హౌస్‌లనీ.. బ్రీడింగ్ చేసి పెంచుతాం! సమతుల్యతను కాపాడుతాం! శుచీ.. శుభ్రతా.. టెక్నాలజీ.. మరి మూర్ఖులందరూ దానికి ఎగబడితే 'పర్యావరణం' దెబ్బతింటుంది. దెబ్బతింటే 'ఓజోన్' పొరకు కాస్తా బొక్కపడిపోతుంది! దానికి బొక్కపడితే ఇంకా ఏమైనా ఉందా? మొత్తం ప్రపంచం మంటల్లో మండి సర్వనాశనమై పోతుంది. అదీ!" అని రాజుగారు విడమర్చి వివరించాడు.

"ఎక్కడ బొక్కపడితే మనకేంటి? వాళ్ళు చస్తే పీడాపాయిరి! ఎవడికి నూకలు చెల్లితే వాడు రాలిపోడం ప్రకృతి న్యాయం గదా!" మంత్రి కడు వినయంగా అన్నాడు.

"సర్సరే.. మనదేశంలో మనం వివిధ రకాలయిన పనికి వచ్చే.. పనికిరాని.. మనకసలే అవసరపడని వస్తువుల్ని.. పదార్థాల్ని తయారు చేసి పారేస్తున్నాం! అట్లా అయితేనే మన కార్ఖానా చక్రాలు తిరుగుతాయి. వాటి మన యజమానుల ఉత్పత్తులు సాగుతాయి. మరి వాటన్నిటినీ వీళ్ళకు అమ్మకాలు జరపాలంటే.. ఇటు కోడి తొడలు.. పాలు.. జున్ను.. గోధుమలు.. పిండి.. పనికిరాని మందులు.. గింజలు.. విత్తనాలు.. సౌందర్య వస్తువులు.. అబ్బో.. ఇది పెద్ద లిస్టు.. మరి వీటన్నిటినీ వాళ్ళు తయారు చేసుకోకుండా చూసుకోడం మన న్యాయమన్న మాట!" ఆ దెబ్బకి మరి మంత్రిగారు నోరుమూసుకున్నాడు.

మరో రోజు –

"ఫలానా దేశంలో జనాలు కత్తులకూ.. బరిసెలకూ ఉప్పుపోసి పదును పెడుతున్నారని తెలిసింది. టర్టటట్ట.. అది కడు నేరం.. వెంటనే ఆ దేశం మీద యుద్ధం ప్రకటించండి.. మన చతురంగ బలగాల్ని కూడగట్టండి.. బాంబులను వేగిర పరచండి.. ఏనుగుల అంబారీలు సర్దండి.. కవచాలు బిగించండి.. విమానాలను రెడీ చేయించండి....

మంత్రి తెల్లబోయి దద్దరిల్లాడు. "వాళ్ళెవరో ఏవో కోసుకోవడానికి కత్తులు పదును పెట్టుకుంటే మనకేంటి సార్.. నాగళ్ళ కర్రులు కొలిమిలో పదున్లు పెట్టుకుని దున్నుకుంటారు – కాదంటే ఎట్లా....?"

"అదేం కుదర్దు! వాళ్ళు 'కోయడం' చట్ట ఉల్లంఘన – తర్వాత కత్తులు మెరిసేలా పదును పెట్టడం ఈ భూగోళంలో శాంతికి ఘోరమైన విఘాతం.. కలిగిస్తుంది. ఎక్కడ అశాంతి చెలరేగినా.. ప్రజలు అసంతృప్తి చెందినా నేను దాన్ని సహిస్తూ.. చూస్తూ ఊర్కోలేను. ఆహా.. ఎంత పొగరు.. ఎంత ధైర్యం.."

రాజుగారు తోకతెగిన కోతిలా యమా చిందులు తొక్కాడు. చివరికి పదిమంది పెద్ద మనుషుల్ని పంపి.. ఆ పదును కత్తులూ.. కటార్ల సంగతి తేల్చుకుని ఆనక నిర్ణయాలు తీసుకుందామని కాస్తంత తలపండిన పెద్ద మనుషుల సంఘం నిర్ణయించింది. ఆ మేరకు ఆ దేశంలో కత్తులు కటార్లు తనిఖీకి నిపుణుల బృందాన్ని పంపడం జరిగిపోయింది. ఇదిలా ఉండగా...

☆ ☆ ☆

అంధ ఆంధ్రరాజ్యంలోకి అగ్ర అంధదేశపు గూఢచారి నిపుణులనూ.. ప్రత్యేక సిబ్బందినీ దిగుమతి చేసుకుని ఇక్కడి రాజ్యంలోని శాంతిభద్రతలను కాపాడడానికీ.. కుట్రదారులను ఏరిపేసి తన పదవిని మరో పది కాలాలపాటు పదిలంగా వుంచుకునే ఉద్దేశంతో మంతనాలు.. రాయబారాలు కొనసాగింపుకు తగులుకున్నాడు.

ఆరోజు...

"ఓరి కనకయ్యా.. ఈ యఫ్‌బిఐ.. అమెరికా పోలీసులు దిగబడి నేర పరిశోధనలు చేస్తారట!" కానిస్టేబులు కరీం గుబులుగా అన్నాడు.

"అంతేకాదురా తంబ్రీ.. లా అండ్ ఆర్డర్.. బందోబస్తు అన్నీ అక్కడి ప్రయివేట్ కంపెనీ వాడికి అప్పగించేసి చేతులు దులుపుకునేలాగుంది.."

"అంటే – మరి మనవంతా ఏం చేయాలట్రా!" కరీం నిర్ఘాంతపడి పోయాడు.

"ప్రస్తుతం గుడుంబా కేసులు.. రాంగ్ పార్కింగ్.. సిన్మా బ్లాక్ టికట్లు.. అంతవరకే మన పని.. మొత్తం హోం డిపార్టుమెంటు ప్రయివేటుగా.. యఫ్‌బిఐ.. చూసుకుంటుందట." బీడీ వెలిగించి అతి విచారంగా మూలిగాడు కనకయ్య కానిస్టేబులు.

"అరె.. ఆ మాత్రం దానికి మనవెందుకూ – అది కూడా ఎవనికో కట్టబెట్టి చేతులు దులుపుకుంటే పోలా!" కరీం టోపీ పీకి రుసరుసలాడాడు.

"మరి ఇపుడదే.. చేతుల పిండి దులుపుకోడవే.. మనం ఒకటీ అరా గుడుంబా.. జేబుదొంగా కేసులు పట్టుకుని పదీ పరకా వంతున వసూళ్ళకు తగులుకుని వెళ్ళదీసుకోడవే.. మరింక మనకు జీతబత్యాలు.. పెన్షన్లు.. పీకులాటలు ఉండవు..."

"హా.. హా.." కరీం విరుచుకు పడిపోయాడు.

☆ ☆ ☆

"ఆ ఫలానా దేశంలో కత్తులు వాడకం పూరాగా లేదనీ.. సానలు పట్టే సరంజామా అస్సలు లేనేలేదనీ.. ప్రజలందరూ సంతృప్తిగానే ఆ రాజుగారి ఏలుబడిలో ఉండినారనీ.. రాజుగారి పట్ల విధేయత ప్రకటించి శాంతిగా ఉన్నారనీ మన పర్యవేక్షకులు నివేదిక అందించారు ప్రభూ.." మంత్రిగారు నివేదించారు.

"టర్టటట్ట.. అదేం కుదర్దు.. నివేదికలు పంపేదాకా వచ్చిన దేశం.. అక్కడ ప్రజలను కాపాడాల్సిన బాధ్యతనాదీ.. ఆ దేశం మీద యుద్ధం ప్రకటిస్తున్నాను.. అట్లాగే 'స్వర్ణాంధ్ర' రాష్ట్రపు శాంతిభద్రతలను టోకుగా మన దేశపు ప్రయివేటు కంపెనీకి కంట్రాక్టు కుదుర్చుకున్న చంద్రబాబుగారికి అభినందనలు తెలపండి! ఇంకా ఇట్లాంటి దేశాల జాబితాను తయారుచేసి బలగాలను మోహరించాలి..."

శివమెత్తిన అమెరికా చిందులు తొక్కుతోంది!

(ఆసియా సోషల్ ఫోరం రగిల్చిన స్మృతులతో...)

అవధానం ఆడవాళ్ళ సొంతం!

లక్ష్మి

అడిగే వాడికి చెప్పేవాడు లోకువ అని మనం వింటుంటాం. ఈ మాట తోచక చెప్పింది కాదు. ఎంతో అనుభవమ్మీద గాని ఇల్లాంటి సూక్తులు పుట్టుకురావు! రెండు రెళ్ళెంత అని సింపులుగా అడిగితే ఫర్లేదు. నాలుగంటాం. నలభై అంటాం. నలభై తప్పంటే నాలుగుతో సరిపెట్టుకోమని సముదాయిస్తాం! అంతేగాని - రెండు రెళ్ళెంతని అడుగుతూనే - దానికి నలభై కలిపి ఎనభైతో హెచ్చవేసి అందులోంచి మూడొందల ఆరు తీసివేస్తే అంటూ మెలికలు పెట్టి ఆన్సరు చెప్పమంటే ఏం చెబ్తాం? కన్నీళ్ళు పెట్టుకుంటాం! అంచేత అడిగే వాడికి చెప్పేవాడు లోకువ అవుతున్నాడు! అవధానంలో మాత్రం ఈ వరస సాగదు. చెప్పేవాడికి అడిగేవాడే లోకువ అవుతాడు! అడ్డదిడ్డమైన ప్రశ్నలు ఎన్ని అడిగినా - వాటిని ఆఫ్టరాల్‌గా తీసి పారేసి కరెక్టు ఆన్సర్లిచ్చి - అడిగిన వాడ్ని అమ్మో అనిపించగల ఆర్టు అవధానికి సొంతమై ఉంటుంది! అది శతావధానం కావచ్చు. అష్టావధానం కావచ్చు. ఏ అవధానమైనా అది ఆషామాషీ విద్య మాత్రం కానేకాదు. పండితుడైనంత మాత్రాన అవధానం అతని సొత్తు అని చెప్పడానికిక్కూడా వీల్లేదు. పాండిత్యం వేరు. అవధానం వేరు. రెండూ రెండు విద్యలు!

అవధానిని పడగొట్టాలనే పంతంతో - అడిగే మనిషి జటిలమైన సమస్యలు అనేకం అవధాని ముందుంచి సరైన సమాధానం చెప్పమంటాడు. ఆ గందరగోళానికి అవధాని చెక్కు చెదరడు. చిద్విలాసంగా నవ్వుతూ వాటిని పద్యాల్లో పరిష్కరించి సెభాషనిపించుకుంటాడు. అష్టావధానమైతే ఎనమండుగుర్నీ, శతావధానమైతే ఏకంగా వందమందినీ అవధానిగారు అదరగొడుతుంటాడు! ఆయా సందర్భాలననుసరించి అంత మందికీ సమాధానాలను అప్పటికప్పుడు అందంగా పద్యాల్లో అల్లేసి - వాటిని సభలో విసిరేసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాడు. వారిచేత సెభాషనిపించుకుంటాడు. మధ్యమధ్య అప్రస్తుత ప్రసంగం కూడా వుంటుంది! అవధానిగారి ఏకాగ్రతని పాడుచేయడానికి ఈ శాఖని ప్రత్యేకించి ఒక చమత్కారి నిర్వహిస్తాడు. కాకులన్నీ నల్లగా ఎందుకుంటాయని అడుగుతాడు. కాకికీ, కోకిలకీ బంధుత్వమేవిటని అడుగుతాడు. నాకూ మీకూ తేడా ఏమిటని ప్రశ్నిస్తాడు. బిల్లు కలెక్టరికీ, జిల్లా కలెక్టరికీ డిఫరెన్సేమిటో చెప్పమంటాడు. కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీ ముడులు మార్చిమార్చి వేస్తాడు. ఈ చెత్త ప్రశ్నలకక్కూడా అప్పటికప్పుడు సమయస్ఫూర్తితో సమాధానాలు చెప్పి సభని రక్తి కట్టించే ఆర్టు అవధానిగారికి అపారంగా ఉంటుంది!

ఇదంతా అవధానం గొడవ. పండిత మహాశయుల మధ్య సాగే పాండిత్యం తాలూకు విన్యాసం! వదిలేయండి. ఇల్లు కూడా ఒక పెద్ద సైజు అష్టావధాన వేదిక! ఆ వేదిక మీద అవధానం చేసే వ్యక్తి - ఆ ఇంటి ఇల్లాలు! ఆమె మెదడ్ని తినేందుకు ఆ ఇంటో అత్తమామలుంటారు. ఆడబిడ్డలుంటారు. చిన్న మరిదీ, చిట్టి మరిదీ ఉంటారు. వీరందర్నీ మించిన ఘనాపాటీ భర్తగారుంటారు. అప్రస్తుత ప్రసంగానికి మేము రెడీ అంటూ చాకుల్లాటి పిల్లలు ఉండనే ఉంటారు! వీళ్ళందర్లో ఇంటి తాలూకు అష్టావధానం టూకీగా ఇలా జరుగుతుంది. ఆమె వంట చేస్తూ ఉంటుంది. వంటకాల్లో ఉప్పు ఎక్కువగా ఉండకూడదు. కారం తక్కువగా తగలకూడదనే నిబంధనలు పాటించాలి. పులుసు వాళ్ల వంశ ప్రతిష్టనే నిలబెట్టే విధంగా ఉండాలి. పచ్చడి వాళ్ళ కీర్తిని పెంచేందుకు సహకరించాలి. కూరల్లో ఉల్లిపాయలు తగు మాత్రమే ఉండి - పచ్చి మిరపకాయలు పిచ్చిపిచ్చిగా తగలాలి. ఈ రూల్సుని శ్రద్ధగా పాటిస్తూ వంట చేయాలి. అంచేత - ఆమె వంట ప్రయత్నంలో ఉన్నప్పుడు తప్పని సరిగా ఏకాగ్రతని పాటించి తీరాలి. సరిగ్గా అప్పుడే ఇంటిల్లిపాదీ తిక్క ప్రశ్నలనేకం అడుగుతుంటారు. వంట మీద ఏకాగ్రత ఆ ప్రశ్నల్లో చెడిపోకుండా - సరైన సమాధానాలు చెబుతూ ఉండాలి! అంతేగాని - వంట పనిలో ఉన్నప్పుడు పిచ్చి ప్రశ్నలడక్కండని విసుక్కో కూడదు. మీ చచ్చు ప్రశ్నలతో వంట చెడిపోయిందని చెప్ప కూడదు. విసుక్కున్నా, వంట చెడిపోయినా సదరు ఇల్లాలు అవధానంలో తన ఓటమిని అంగీకరించినట్టె అవుతుంది!

ఆమె పోపు పెడుతుండగా - బాత్‌రూం నుంచి - నా పేస్టు కనిపించడంలేదని భర్త ఆర్తనాదం వినిపిస్తుంది! సమతూకంలో పోపు గింజలు వేస్తూ - సదరు పేస్టెక్కడ తగలడిందో - వంట గది విడిచి పెట్టకుండానే సమాధానం చెప్పాలి. చెబుతుంది. వదినా అని గావుకేక పెడతాడు చిన్నమరిది. చారుకి తాళింపు పెడుతూ ఏం కావాలని అడుగుతుంది వదిన. ఎకనామిక్స్ పుస్తకమంటాడు. పరుపుకింద దాచి ఉంటావని గుర్తు చేస్తుంది. అమ్మడూ నా కళ్ళజోడు అని ఆయాసపడుతూ అడుగుతాడు మావగారు. మజ్జిగ పులుసు కలుపుతూ - నూతి గట్టుమీద చూడండని ఆన్సరిస్తుంది. నా పెన్ను కనిపించడం లేదు వదినా అని పెద్దమరిది ఫిర్యాదు చేస్తాడు. ఆ పెన్నెక్కడ పెట్టి ఉంటాడో ఆలోచిస్తూ తాళింపు తగిలిస్తుండగా - చిట్టిగాడు ఏనుగు తొండం ఎంత బరువుంటుందని అప్రస్తుత ప్రసంగం చేస్తాడు. మరో పక్క అమ్ములు పదమూడేళ్ళు తొంభైఆరని ఎక్కాలు తప్పు చదువుతుంది. ముందర అమ్ములు చదివే ఎక్కం సరిచేద్దామనే ప్రయత్నంలో ఉండగా - వదినా నాపెన్ను అని రెండోసారి ఫిర్యాదు చేస్తాడు పెద్దమరిది. ఇవతల వేపుడు మాడిపోయే సూచనలు దగ్గిర పడతాయి. ఈ విపత్కర పరిస్థితులకు ఆమె చెక్కుచెదరదు. పెద్ద మరిది పెన్ను అద్దం బల్లమీద ఉందని చెప్పి - ఏనుగుతొండం ఎనభై కిలోల బరువని చిట్టిగాడిని సముదాయించి - పదమూడేళ్ళు తొంభై ఒకటని అమ్ముల్ని హెచ్చరించి - వేపుడు మాడిపోకుండా తక్షణ చర్యలు తీసుకుంటుంది. అష్టావధానానికీ, శతావధానానికీ ఏ మాత్రం తీసిపోని ఇంత గందరగోళాన్ని సమర్థంగా ఎదుర్కొని పరిష్కరించే ఇల్లాలిని అఫ్టరాల్ ఆడమనిషి అని ఎలా అవమానించగలం? ◆

రైతు నేస్తం! రోళ్ళపాడు బట్టమేక పక్షి

రాకెట్ల వీరన్న

ప్రపంచంలోనే అతి అరుదైన పక్షిగా చెప్పబడే ఈ పక్షి (బట్టమేక పక్షి) అరుదైనదే కాక అందమైనదికూడా. బట్టమేక పక్షిని రైతుకు మంచి నేస్తమని చెప్పవచ్చు. ఎందుకంటే పంట పొలాల్లో ఉన్న పురుగులు, మిడతలు, కాళ్ళజెర్లు, తొండలు లాంటి క్రిమికీటకాదుల్ని ఇది తింటుంది. తద్వారా పంటకు నష్టం జరుగకుండా ఇది కాపాడుతుంది. దీనివల్ల రైతుకు కొంతభారం తగ్గినట్టే. పత్తిపంటకు మందుకొట్టకపోతే ఒక పూటకు 10 ఎకరాల్లోని పురుగులను ఇది తింటుంది.

కర్నూలు జిల్లా 'మద్దూరు మండలంలోని "రోళ్ళపాడు వన్యప్రాణి అభయారణ్యంలో" ఈ బట్టమేక పక్షులున్నాయి. ఈ అభయారణ్యం, కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు, నంద్యాల రహదారిలో రోడ్డు ప్రక్కనే ఉంటుంది. కర్నూలు నగరానికి 45 కి.మీ. దూరంలో ఇది ఉంటుంది. బట్టమేక పక్షుల సంరక్షణార్థం ఈ రోళ్ళపాడు వన్యప్రాణి అభయారణ్యాన్ని 1988లో 937 హెక్టార్లలో ఏర్పాటు చేయడమైనది.

ఈ అభయారణ్యంలో ఈ పక్షితోపాటు తోడేలు, నక్క, గుంటనక్క, కృష్ణజింక, కుందేలు, నేల నెమలి, కొండచిలువ,గుడ్లగూబ, త్రాచుపాము, బెరటపిట్ట, రాతిపొలక, ఉడుము, కొరకంచలు కలిసి జీవిస్తాయి. ఈ పక్షి కోసం ఇక్కడి పరిసరాలను గడ్డి బీళ్ళవలె ఉంచాలి. అడవుల్లో ఉండేందుకు ఈ పక్షి ఇష్టపడదు. ఈ పక్షి కాళ్ళకు మూడువేళ్ళే ఉన్నందున ఇది చెట్లపై కూర్చోలేదు. ఇది ఎక్కువగా నేలపైనే తిరుగుతుంది.

పక్షి రూపురేఖలు

ఇది ప్రపంచంలో అరుదైనది. మనరాష్ట్రంలో 180కి మించి లేవు. రోళ్ళపాడు వద్ద దాదాపు 100 పక్షులదాకా ఉంటాయి. బట్టమేక పక్షి 12 నుండి 15 కిలోల బరువు, 1 మీటరు ఎత్తు ఉంటుంది. ఆడదాని కన్నా మగ పక్షి పెద్దగా ఉంటుంది. మెడ పొట్ట భాగములు తెల్లగాను, వీపు గోధుమరంగులోను ఉంటుంది. తలపై నల్లని టోపి మాదిరి ఉండి, ఛాతీవద్ద నలుపు, తెలుపు ఈకలు ఉంటాయి. ఇది సంవత్సరానికి ఒకగ్రుడ్డు పెడుతుంది. ఈ గ్రుడ్డును 28 రోజుల్లో పొదుగుతుంది. ఆడదాన్ని ఆకర్షించుటకు మగపక్షి మూల్గుచు ఆట ఆడుతుంది. ఒకసారి ఈ పక్షి పైకిలేస్తే 4 కి.మీ. ప్రయాణించి వస్తుంది. ఇది ఇతర జంతువుల బారి నుంచి రక్షించు కొనుటకు చచ్చినదానివలె నటిస్తుంది.



ఈ పక్షి కర్నూలు జిల్లాలో ఎక్కువ మహబూబ్‌నగర్, గాను, అనంతపురం, హైదరాబాద్ జిల్లాల్లో అరుదుగాను కన్పిస్తుంది. ఈ బట్టమేక పక్షి సంరక్షణా కేంద్రాలు ఒరిస్సా, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్నాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఉన్నాయి. దీని సంరక్షణకు నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయించగా, సంరక్షించే బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలది. ఆయా రాష్ట్రాల అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి.



రోళ్ళపాడు వన్యప్రాణి అభయారణ్యంలో బట్టమేక పక్షులతోపాటు 600దాకా జింకలున్నాయి. అంతేకాక నక్కలు, గుంటనక్కలు, కుందేళ్ళు, బాతులు, నేలనెమలి, బరటపిట్ట, ఉడుము, చిలుకలు, కొండచిలువలు, తదితర పశుపక్ష్యాదులు ఉన్నాయి.

ఇక్కడి సౌకర్యాలు

పర్యాటకుల కోసం ఇక్కడ ఒక డార్మెటరీ, ఒక గెస్ట్ హౌస్ ఉన్నది. అంతేకాక పర్యావరణ విద్యాకేంద్రము ఉన్నది. దీనిని 1999 లో రు. 10 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. ఇందులో ఇక్కడి పరిసర ప్రాంతాలను, ఈ ప్రాంతాలలో నివసించే జంతువులు, పక్షుల రూపాలను, పెయింటింగ్స్‌ను, ప్రపంచంలోని గడ్డి మైదానాలను, అక్కడ నివసించే జంతు, పశుపక్ష్యాది జీవరాశుల్ని చిత్రీకరించారు.

గ్రంథాలయం, డాక్యుమెంటరీ ఫిలింస్

సందర్శకుల కొరకు వన్య ప్రాణుల గురించి తెలియజేసే పుస్తకాల గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అంతేకాక, వన్యప్రాణులకు సంబంధించిన చక్కటి డాక్యుమెంటరీ చిత్రాలను ప్రదర్శించుటకు వీలుగా ఆడిటోరియం ఉన్నది. పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి, కాపాడుకోకపోతే ఏమినష్టం జరుగుతుందో తెలియజేసే చిత్రాలున్న మొబైల్ వ్యాన్ కూడా ఉన్నది.

అనువైన సందర్శన కాలం

వీటిని దర్శించి బాగా ఆనందించాలంటే జూలై నుంచి అక్టోబర్ మాసాలు అనువుగా ఉంటాయి. ఉదయం లేదా సాయంత్రం వేళలైతే మంచిది. ఏదిఏమైనా ఇంత అందమైన, అరుదైన పక్షిని, ఇన్ని సౌకర్యాలతో కూడుకున్న వన్యప్రాణి సంరక్షణా కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిందే. ◆

ఆదరణ కరువైన ఫుట్‌బాల్

రాం ప్రసాద్

దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సాకర్ పోటీలు ఇటీవల బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగాయి. వరుసగా రెండుసార్లు టైటిల్ గెలుచుకున్న భారత జట్టు ఈ సారి తన ఆధిక్యత నిలబెట్టుకోలేకపోయింది. ఓటమితోనే భారత్ టోర్నమెంట్ ప్రారంభించింది. పాకిస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో పరాజయం పాలైంది. తరువాత రెండు వరుస విజయాలతో సెమీఫైనల్స్‌లో ప్రవేశించగలిగినప్పటికీ బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తిరిగి ఓటమిపాలై కంగుతింది. బంగ్లాదేశ్ బలహీనమైన జట్టయినప్పటికీ భారత జట్టు సభ్యుల అలసత్వం కారణంగా చేజేతులా ఓటమి కొనితెచ్చుకుంది. దాంతో మూడో స్థానం కోసం ఆడాల్సి వచ్చింది. మరోవైపు పాకిస్తాన్ కూడా మాల్దీవుల చేతిలో పరాజయం పాలవడంతో అనూహ్యంగా రెండు అండర్ డాగ్ వంటి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. బంగ్లాదేశ్ ఫైనల్లో మాల్దీవులను ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది. శాఫ్ చరిత్రలో భారత్ రెండోసారి బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయింది. మూడో స్థానం కోసం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ గోల్డెన్ గోల్ సహాయంతో నెగ్గింది. దీంతో పాకిస్తాన్ చేతిలో రెండోసారి ఓటమి చెందిన అవమాన భారాన్ని తప్పించుకోగలిగింది. ఏమైనా భారత్ తన ఆధిక్యతను ఈ టోర్నమెంట్‌లో నిరూపించుకోలేకపోయింది. భారత జట్టు మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా గాయం కారణంగా ఆడకపోవడం కూడా భారత జట్టు ఓటమికి దారితీసిందని చెప్పవచ్చు.

అయినా భారత ఫుట్‌బాల్ క్రీడ ఏదో ఒకటి, రెండు జట్లకు మాత్రమే పరిమితమైంది. మోహన్‌బగాన్, సాల్గోకర్, ఈస్ట్ బెంగాల్ జట్లకే పరిమితమైన ఈ క్రీడ దేశ వ్యాపితంగా ఎక్కువ మందిని ఆకర్షించలేకపోతోంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు స్పోర్ట్స్ అథారిటీలు క్రికెట్ క్రీడకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తూ మిగిలిన క్రీడల పట్ల అలక్ష్యభావం ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు ఢాకాలో జరిగిన టోర్నమెంట్‌లో భారత్ తరఫున ఆడిన వారిలో అనేకమంది క్రీడాకారులు పూర్తి ఫిట్‌నెస్‌తో లేరని విమర్శలు వచ్చాయి. కీలకమైన అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన సామర్థ్యం, ఓర్పు భారత క్రీడాకారుల్లో కరువయ్యాయి. ఫుట్‌బాల్ క్రీడకు ఎంతో కొంత ప్రాచుర్యం కల్పిస్తున్న క్లబ్‌లు ఈ విషయాన్ని విస్మరించి తదనుగుణంగా శిక్షణ ఇప్పించడంలో విఫలమవుతున్నాయి. మ్యాచ్ షెడ్యూల్ పై కూడా ఇవి అంత ఆసక్తి ప్రదర్శించడం లేదు. ప్రధాన టోర్నమెంట్లు జరగనున్న తరుణంలో క్లబ్‌లు అందుకు సంబంధించిన జాగరూకతలు తీసుకోవడం లేదు. ముందే చెప్పుకున్నట్లు బైచుంగ్ మెడ పట్టివేయడంతో టోర్నమెంట్‌కు దూరంగా ఉన్నాడు. వియత్నాంలో జరిగిన ఎల్‌జికప్‌లో భారత్ అనూహ్య విజయం సాధించిన తర్వాత భారత జట్టుపై ఆశలు పెరిగాయి.

క్లబ్‌లు తమ ఆదాయం పెంచుకునేందుకు అవాంఛనీయంగా ప్రవర్తిస్తున్నాయి. గాయపడిన వారి చేత ఆడిస్తున్నాయి. వారికి తగిన విశ్రాంతి నివ్వడం, వైద్య సదుపాయాల విషయంలో అవి తగిన ఆసక్తి ప్రదర్శించడం లేదు. తగిన విరామం ఇవ్వకుండా ఎడతెగని రీతిలో ఆడిస్తున్నాయి. ఇందువల్ల ఫిట్‌నెస్ సమస్యలు మరింతగా పెరిగిపోతున్నాయి. కీలకమైన టోర్నమెంట్లకు సీనియర్ క్రీడాకారులు అందుబాటులో ఉండలేకపోతున్నారు. భారత్ కోచ్ కాన్‌స్టయిన్‌టైన్ టోర్నమెంట్ అనంతరం ఒక విచిత్రమైన వ్యాఖ్య చేశారు. భారత్ ఈ టోర్నమెంట్‌లో పాల్గొనకుండా ఉండి ఉండాల్సిందని ఆయన అన్నారు. యూరోపియన్ దేశాలతో మైత్రీ పూర్వక మ్యాచ్‌లు ఆడి ఉంటే మరింత ఉపయోగకరంగా ఉండేదని ఆయన అన్నారు. ఇందుకోసం ఒక ప్రధాన టోర్నమెంట్‌కు గైర్హాజరుకానక్కర లేదు కదా! ఈ పనిని నిరంతరం చేయవచ్చు. దేశంలో సమర్థులైన కోచ్‌లు అందుబాటులో లేకపోవడం కూడా ఫుట్‌బాల్ క్రీడ వ్యాప్తి చెందకపోవడానికి మరో కారణంగా చెప్పవచ్చు. అంతర్జాతీయ పరిస్థితులు, వస్తున్న మార్పులు సాకల్యంగా అర్థం చేసుకునే కోచ్‌లు కరువయ్యారు. అందుబాటులో ఉన్న కోచ్‌లు కూడా ఏదో సంప్రదాయ సిద్ధంగా పోయేవారే కానీ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహ రించే వారు కాకపోవడం కూడా ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధి కాకపోవడానికి కారణమవుతోంది. ఏమైనా వియత్నాంలో జరిగిన ఎల్‌జికప్‌లో భారత్ విజయ ఢంకా మోగించి చాలా కాలం తరువాత అభిమానుల్లో ఆశలు రేకెత్తిం చింది. అయితే శాఫ్ టోర్నీలో దీనిని నిలబెట్టుకోలేక పోయింది. పాఠశాల స్థాయి నుండి ఫుట్‌బాల్ క్రీడకు ఆదరణ కల్పించాలి. క్రికెట్‌కు ఇచ్చిన విధంగానే ఈ క్రీడకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రతి పాఠశాలలో కోచ్‌లను తప్పనిసరిగా నియమించాలి. క్రికెట్ విషయంలో జరుగుతున్న విధంగానే జోనల్ మ్యాచ్‌లు నిర్వహించాలి. ప్రతిభావంతులను కాగడా పట్టి వెలికి తీసి వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. క్రీడను ప్రోత్సహిస్తున్న పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి. ◆

ప్రపంచ సాకర్ కప్ భారత జట్టు కెప్టెన్ చేతికి ఇలా ఎప్పుడు వస్తుందో ?

(ఫిఫా-2002 ప్రపంచకప్‌ను ప్రదర్శన నిమిత్తం భారత్‌కు తెచ్చినప్పుడు ఆ కప్‌తో ఫొటోగ్రాఫర్లకు ఫోజిచ్చిన భారత సాకర్ జట్టు కెప్టెన్ బైచుంగ్ భుటియా)



ఎ.వి.వర్మ

ఎగిరే బంతి

సుబ్రమణ్యం పనిచేస్తున్న ప్రభుత్వరంగ సంస్థ ప్రయివేటుపరం అయ్యేందుకు సిద్ధమైంది. వేలాది కార్మికుల గుండెల్లో గునపాలు గుచ్చుకున్నాయి. బతుకుల్లో ఆటంబాంబులు పేలినయి.. అప్పటికే సగంమందికి విఆర్ఎస్ ఇవ్వటం జరిగింది. మెమోరాండాలు.. మొత్తుకోళ్లు.. సమావేశాలు.. సభలు.. ప్రదర్శనలు.. నిరసన దీక్షలు.. పోలీసుల రంగప్రవేశం.. దీక్షా శిబిరం కూలగొట్టటం.. హాహాకారాలు.. లాఠీలమోతలు.. ఉద్రిక్త వాతావరణం.. మిన్నుముట్టిన నినాదాలు.. పోలీసుల జులుం.. తలలు పగిలే శబ్దాలు.. రక్తంవోడులుతున్న స్థితి.. నాయకుల బలవంతపు అరెస్టులు.. సంఘటితంగా కార్మికులు అడ్డుకోవటం.. ఖాకీల క్రౌర్యం.. కాళ్లూ కీళ్లూ విరగటం.. పొత్తికడుపుల్లో బూటుకాళ్లతన్నులు.. ఒక్కొక్కరిని రోడ్డుపై ఈడ్చుకెళ్లటం.. వ్యానుల్లోకి విసిరేసి కుక్కటం.. కేసులు.. కోర్టులు.. బెయిళ్లు.. ప్రభుత్వ దమనకాండ.. అణిచేకొద్దీ కార్మికుల వరుస వారీ పోరాటాలు ఉవ్వెత్తున లేస్తూనే వున్నాయి.

రంగనాథశాస్త్రి మాణిక్యమ్మల ముద్దుల కొడుకు సుబ్రమణ్యం. తల్లిదండ్రులను పూజించేవాడు. దైవభక్తుడు. నిష్ఠాగరిష్ఠుడు. స్థిరచరాస్తులు లేవు. పేదరికంలో మగ్గుతూనే డిగ్రీ పూర్తి చేశాడు. ప్రభుత్వరంగ సంస్థలో వుద్యోగం వచ్చింది. జానకమ్మను పెండ్లి చేసుకున్నాడు. ఇద్దరు సంతానం. ఒక కొడుకు, ఒక కూతురు. ప్రతి సంవత్సరం పుణ్యక్షేత్రాలు, పవిత్ర స్థలాలు కుటుంబ సమేతంగా దర్శించేవాడు. క్రమం తప్పకుండా సత్యన్నారాయణ వ్రతం నోచేవాడు. బిడ్డల పెంపకం, చదువు సంధ్యలు స్వయంగా పర్యవేక్షించేవాడు. ఇద్దరు బిడ్డలను కాలేజీలో జేర్పించాడు. వేలకు వేలు పోసి ట్యూషన్లు చెప్పించేవాడు. భార్యను పువ్వుల్లో పెట్టి చూసుకునేవాడు. విలువైన బట్టలు, బంగారు ఆభరణాలకు కొదువలేదు. కలర్‌టీవీ, మిక్సీ గ్రైండర్, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వగైరా ఆధునిక వినిమయ వస్తువులు మార్కెట్లోకి రాగానే యింట్లో అమర్చేవాడు. వృద్ధులైన తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకునేవాడు. గుడికి వెళ్లటం, పూజలు పునస్కారాలు నిత్యకృత్యం. గృహమేకదా స్వర్గసీమ నానుడికి సింబల్‌గా కుటుంబాన్ని తీర్చిదిద్దుకున్నాడు. జీవితాన్ని దైవప్రసాదంగా భావించాడు. పూర్వజన్మ సుకృతంగా పొంగిపోయాడు. తన అదృష్టానికి మురిసిపోయాడు. అన్నీ ఉన్నా అశనిపాతంలా తను పనిచేస్తున్న సంస్థ ప్రయివేటుపరం చేయబోతుండటం తృప్తిగా సాగిపోతున్న జీవితనౌకను కన్నీటి కడలిలో కుదుపులకు గురిచేసింది.

సుబ్రమణ్యం సంస్థలో తన పనేదో తను చేసుకుపోయేవాడు. ఏ యూనియన్ వాళ్లడిగినా సభ్యత్వం మాత్రం చెల్లించేవాడు. మీటింగులకు, ప్రదర్శనలకు, ధర్నాలకు దూరంగా వుండేవాడు. నల్లబ్యాడ్జీలు సైతం పెట్టేవాడు కాదు. ఎన్నడూ సమ్మెచేసి యెరగడు. యాజమాన్యానికి తల్లో నాలికలా వుండేవాడు. పై అధికారులతో వినయ విధేయతలతో నడుచుకునేవాడు. నమ్రతతో పనిచేసేవాడు. విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలిగే వెంకటేశ్వర స్వామి నిలువెత్తు పటానికి అర్చకుని పని చేసేవాడు. వారానికొకసారి స్టాఫ్ మొత్తానికి ధూప దీప నైవేద్యాలతో తీర్థ ప్రసాదాలు అందజేసేవాడు. మెకనైజేషన్, ప్రయివేటైజేషన్‌లు కార్మికులకు ఉద్వాసన, పనిభారం, ఉద్యోగ భద్రతకే ముప్పు అని ఓ కార్మిక యూనియన్ కోడై కూస్తుంటే వాళ్లట్లాగే చెప్తారని తేలిగ్గా కొట్టి పారేసేవాడు. మన సంస్థ తెల్లయేనుగు కాదండీ కామధేనువు అని కాంప్లిమెంటిచ్చేవాడు. అలాంటి తన సంస్థను ప్రయివేటుపరం చేస్తున్నారనే సరికి అవాక్కయ్యాడు. వాస్తవానికి తన సంస్థ లాభాల వెల్లువలోనే వుంది. అటువంటి దాన్ని యెందుకు ప్రయివేటుపరం చేస్తున్నారో అర్థంగాక జుట్టు పీక్కున్నాడు. డిగ్రీ చదువుతున్న బిడ్డలు, వృద్ధులైన తల్లిదండ్రుల భవిష్యత్తు తల్చుకొని వుండేలు దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడిపోయాడు.

సుబ్రమణ్యం తన జీవితంలో మొట్టమొదటిసారిగా యూనియన్లు ఇస్తున్న వరుసవారీ పోరాటాలలో చురుగ్గా పాల్గొన్నాడు. నిరసన దీక్షా శిబిరాన్ని పోలీసులు భగ్నం



కావించబోయిన రోజు లాఠీ దెబ్బలు తిన్నాడు. అరెస్టయ్యాడు. కేసు కూడా నడుస్తూనే వుంది. ప్రయివేటైజేషన్ దెబ్బతో మిలిటెంటుగా తయారయ్యాడు. గతంలో యూనియన్ల యెడ తన వైఖరికి సిగ్గుపడిపోయాడు. మదిలో గతం సినిమారీలులా తిరగసాగింది. ఒకదశలో నాయకులు అమ్ముడుపోయారు. కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తాకట్టు పెట్టారు. పోరాటాలను నీరుగార్చివేశారు. అలాంటి స్థితిలో కారుచీకట్లో కాంతిరేఖలా ఈ యూనియన్ ఉద్భవించింది. ప్రతి సమస్యపైన స్పందించింది. కార్మికులను చైతన్యపరిచింది. ఐక్యతకోసం కృషి చేస్తూనే స్వతంత్ర పోరాట పంథాను చేపట్టింది. అనేక ఆటుపోట్లు యెదుర్కొంది. క్రమంలో ఐక్య పోరాటాలను అభివృద్ధి చేసింది. అనుభవించిన సౌకర్యాలన్నీ ఆ యూనియన్ పుణ్యమే. కానీ పులి మీద పుట్రలా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణల కబంధ హస్తాలు బిగుసుకున్నాయి. ప్రపంచబ్యాంకు బ్రహ్మరాక్షసి నోరు తెరిచింది. వేతన స్తంభన మొదలైంది. కరువు భత్యానికి యెసరు పెట్టారు. అలవెన్సులు రద్దు చేశారు. అడ్వాన్సులు కుదించివేశారు. సెలవులు తగ్గించారు. వీఆర్ఎస్ ఇవ్వటం ప్రారంభమైంది. అన్నిచోట్లా కాంట్రాక్టు లేబర్‌ను కుదుర్చుకుంటున్నారు. అవసరమైతే వుంచుకోవటం, లేకుంటే తొలగించే హైర్ అండ్ ఫైర్ సిస్టం ప్రవేశపెట్టారు. కార్మికవర్గం అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న సకల సౌకర్యాలు సంస్కరణల పేరుతో ఒక్కొక్కటి ఎగరగొడుతున్నారు. అంతటితో ఆగలేదు. అధికారపార్టీ పారిశ్రామికవేత్త త్రిపాఠిజైన్‌కు అమ్మకం పెట్టారు. ఐదువేల కోట్ల సంస్థ ఆస్తుల్ని ఐదువందలకోట్లకు బేరం కుదిరింది. ఎవరికి పని వుంటుందో ఎవరిని పనిలో నుండి తీసివేస్తారో అంతా అయోమయంగా వుంది. ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలు అవలంబించే ముందు నుంచే తమ యూనియన్ కార్మికవర్గం ఎదుర్కోబోతున్న సమస్యలు, తమ సంస్థలో రాబోయే విపత్తు గూర్చి చెవిలో శంఖమై వూదింది. మిగిలిన యూనియన్లు పట్టీ పట్టనట్టు, అంటీ అంటనట్టుగా వుంటున్నయి. తమ యూనియన్ చొరవతో అన్ని యూనియన్లు ఒకే త్రాటిపైకి వచ్చాయి. పోరాటకమిటీగా ఏర్పడ్డాయి. అవిశ్రాంతంగా పోరాడుతూనే వున్నాయి. అలాంటి యూనియన్‌కా తను యిన్నేళ్లూ దూరంగా వుంది? ఆ ప్రశ్న ఎదురవగానే సుబ్రమణ్యం గతుక్కుమన్నాడు. గుండె కలుక్కుమంది. మనస్సు మూగబోయింది. ఈ కొద్ది కాలంలోనే చేసిన పోరాటాల ఫలితంగా ముఖ్య కార్యకర్తగా రూపొందిన సుబ్రమణ్యం సినిమా రీలు గతానికి నిట్టూర్చాడు. ఆ రోజు రిలే నిరాహారదీక్షలో నిరసన దీక్షా శిబిరంలో కూర్చున్నాడు.

నిరసన దీక్షా శిబిరం కొనసాగుతూనే వుంది. ప్రభుత్వం రెండు రోజుల్లో త్రిపాఠిజైన్‌కు ప్రభుత్వ సెక్టారును హేండోవరు చేసేందుకు ముహూర్తం పెట్టింది. పోరాటకమిటి అత్యవసర జనరల్ బాడీ కాల్ ఫర్ చేసింది. సమావేశం పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. త్రిపాఠి జైన్‌కు హేండోవరు చేసే రోజు యావన్మంది ఉద్యోగ, కార్మికుల కుటుంబ సభ్యులతో సహ దిగ్బంధనం చేయాలని, మరుసటి రోజు నుంచి "నిరవధిక సమ్మె" చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. "దిగ్బంధనం" జయప్రదం చేసేందుకు నాయకులు, ముఖ్య కార్యకర్తలు దళాలుగా యేర్పడ్డారు. ఆ సంస్థలో పనిచేసే కార్మికుల యిళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులందరినీ కార్యక్రమంలో పాల్గొనేలా చేయటం దళాల లక్ష్యం. ఒక్కొక్క దళం సిటీలో కొంత యేరియా చూసేలా విభజించుకున్నారు. అన్నిదళాలు తమ పనిలో నిమగ్నమై వున్నాయి. సుబ్రమణ్యం ఒక దళానికి నాయకత్వం వహించాడు. తమకు కేటాయించిన ఏరియాలో వున్న కార్మికుల అందరి కుటుంబాలను కలిసి ప్రతి ఒక్కరికి విషయాలు చెప్పి దిగ్బంధనానికి వెళ్లవలసిన అవసరాన్ని గుర్తింపజేశాడు. వాళ్లల్లోనే కొందరికి బాధ్యతలిచ్చి అందరినీ కదిలించి, అందరూ కలిసి వచ్చే వాతావరణాన్ని యేర్పర్చి దళ సభ్యులను యిళ్లకు పంపి తనూ యింటికి జేరాడు. రేపు ఉదయం దిగ్బంధన కార్యక్రమానికి సిద్ధం కావల్సిందిగా తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. స్నానపానాదులు ముగించుకొని ఆదివారం అనుబంధం చదువుతూ నిద్రకు ఉపక్రమించాడు.

అర్ధరాత్రి సమయం. తలుపులు టకటక మోగినయి. మాణిక్యమ్మ కళ్లు నలుపుకుంటూ వచ్చి తలుపులు తెరిచింది. పోలీసులను చూసి బిత్తరపోయింది. పోలీసులు బూట్ల శబ్దంతో వెళ్లి సుబ్రమణ్యంను లాఠీలతో తట్టిలేపారు. అడిగే దానికి దేనికీ సమాధానం చెప్పకుండా సంకెళ్లు వేసి బలవంతంగా లాక్కెళ్లి వ్యానులో పడవేశారు. వ్యానులో అప్పటికే తన సహ వుద్యోగులు వున్నారు. ఇంట్లో నుంచి ఏడుపులు హృదయవిదారకంగా వ్యాను వీధి మలుపు తిరిగే వరకు వినిపిస్తున్నాయి. అందరినీ కోర్టులో హాజరుపర్చారు. నిరసన దీక్షలో పాల్గొని దిగ్బంధనం, నిరవధిక సమ్మెలు చేసి పారిశ్రామిక శాంతికి భంగం కలిగించే కుట్ర కింద ఏడు సంవత్సరాలు జడ్జీగారు జైలు శిక్ష విధించారు. అందరినీ జైలుకు తరలించారు. అది త్రిపాఠి జైన్ ప్రయివేటు జైలు. అందులో పోలీసులు ప్రభుత్వ పోలీస్ డ్రెస్సే వేసుకున్నారు. టోపీకి బదులు తలపాగా వుంది. సుబ్రమణ్యం జైలు లోపల అందరినీ పరికించాడు. ఖైదీలుగా తమ నాయకులు, కార్యకర్తలు, సహ ఉద్యోగులందరూ వున్నారు. అంతేకాదు వీఆర్ఎస్ యిచ్చి పంపినవాళ్లు కూడా వున్నారు. ఒక్కొక్క హాలులో వందల మందిని కుక్కేరు. ఒక్కొక్కరికి నీలం చొక్కా నిక్కరు రెండు జతలతో పాటు ఒక టవలు, దుప్పటి ఇచ్చారు. జైలులో వుండవలసిన కనీస సౌకర్యాలు లేవు. ఉదయం నాలుగు గంటలకు లేవాలి. అందరూ కలసి అన్నం వండుకోవాలి. అన్నంలో గంజి యెక్కువగా వంగేలా చూసుకోవాలి. గంజిలో ఉప్పు కల్లు వేసుకొని టిఫిన్ టీ బదులు తాగాలి. అన్నంలోకి అనుపాకం రసం మాత్రమే. మజ్జిగ వూసెత్తే ప్రశ్నేలేదు. మజ్జిగ బదులు గంజిపోసుకోవచ్చు. ఆదివారం ఒక్కపూట మాత్రం బంగాళాదుంప కూర వండుకోవచ్చు. అందరూ స్నానం చేసి విడిచిన డ్రెస్ ఉతుక్కొని వేరొక డ్రెస్ వేసుకున్నారు. గంజినీళ్లు కడుపునిండా తాగారు. కేరియర్‌లో అన్నం, రసం, గంజి సర్దుకున్నారు. ఎనిమిది గంటలకు అందరి కాళ్లూ చేతులూ గొలుసులతో బంధించారు. అందరినీ వ్యానుల్లో ఎక్కించుకొని పనిచేయవలసిన చోటుకు

(మిగతా 23వ పేజీ)

స్త్రీ సమస్యలకు అద్దం పట్టే కథలు

ఏ వాదాల వెలుగులో కాకుండా, మొదటి నుండి స్త్రీలు – స్త్రీ సమస్యల మీద ఆలోచనాత్మకమైన కథలు రాసిన వారిలో అబ్బూరి ఛాయదేవి ప్రముఖులు. స్త్రీల సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన రచయిత్రి వెల్లడించిన అభిప్రాయాలు-సూచనలు 60వ, 70వ దశకాలలో విప్లవాత్మకమైన ఆలోచనలతో సంచలనం సృష్టించారు. స్త్రీ బాల్యం – యవ్వనం – వృద్ధాప్య దశలకు సంబంధించిన వివిధ సమస్యలను వివరించడంతోపాటు తార్కికంగా విశ్లేషించటం వారి కథల ప్రత్యేకత.

మగవాడికి, ఆడదానికి పెంపకంలో వున్న తేడా వల్లనే ఆడదాని బ్రతుకు – వ్యక్తిత్వం 'బోన్‌సాయ్'లా కుంచించుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఎదిగిన ఆడపిల్లలు ఎదుర్కొనే స్త్రీల మూడురోజుల వ్యవహారాన్ని, ఆచార వ్యవహారాల పేరిట అత్యంత అమానవీయంగా మార్చిన పరిస్థితుల నుండి విముక్తి కొరకు పరితపించిన స్త్రీ హృదయాన్ని "మూడునాళ్ల ముచ్చట"లో చూడవచ్చు. ఒకటి రెండు అగ్రవర్ణాలు తప్పించి మిగతా కులాలలోగానీ, మతాలలోగానీ ఇలాంటి సమస్యలు లేవన్నది మనకు తెలిసిన విషయమే. తాను నమ్మిన వాటికోసం తల్లిదండ్రులను కూడా లెక్కపెట్టనంత స్థిరచిత్తం కలిగిన రమ తెలివి తేటలు, ముందుచూపు ఆధునికమనిపించినా, కొన్ని విషయాలలో మిగతా వారిలాగే ఆలోచించడంతోనే చిక్కు వస్తుంది. పెండ్లి విషయంలో తల్లిదండ్రుల నిర్ణయాన్ని ధిక్కరించిన రమ అత్యాచారానికి గురయిన తర్వాత శారీరక పవిత్రత, పాతివ్రత్యం లాంటి అంశాలకు అతీతంగా ఆలోచించకపోవడం వల్ల మానసిక సంఘర్షణకు గురవుతుంది. తన వ్యక్తిత్వాన్ని గుర్తించే సహచరుడి కోసం అన్వేషించిన రమ ప్రేమికుడు మూర్తిలో నగటు మనిషినే చూడగలుగుతుంది. తాను నిరాకరించిన శేఖరంలోనే ఉన్నత వ్యక్తిత్వాన్ని చూసి అతనితో జీవితం పంచుకోవడానికి సిద్ధపడుతుంది. స్త్రీలపై జరిగే అత్యాచారాలకు కుమిలిపోయి ఆత్మహత్య చేసుకోవడమో, ఒంటరిగా మిగిలిపోవడమో కాకుండా, దాన్ని అధిగమించి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించిన ఈ కథ 1965 నాటికే ఒక కొత్త దృక్పథాన్ని ఆవిష్కరించగలిగింది. "శ్రీమతిగా–ఉద్యోగిని"గా ద్విపాత్రాభినయం చేస్తున్నా కుటుంబంలో కొనసాగే వివక్షలో, అణచివేతలో ఎలాంటి మార్పూ వుండదు. చివరకు భర్త అయినా, కొడుకయినా వారి ఆధిపత్య ధోరణులకు 'మొగ్గు' చూపవలసిందే. ఇంటిని, భార్యా, పిల్లల్ని గాలికొదిలేసి ఉద్యమాలలోకి పోయి గొప్పవాళ్లయిపోయిన వాళ్లున్నారు. కాని వారు వదిలేసిన కుటుంబాన్ని, పిల్లల్ని పెంచి ప్రయోజకులను చేయడంలో భార్య అనుభవించిన కష్టాల్ని, ఆమె త్యాగాలను బేరీజు వేస్తే నిజంగా ఎవరు గొప్పవాళ్లో తెలుస్తుంది. 'కలం' పేరుతో రాసే జంట రచయితలలో ఒకరు చనిపోయినా, రెండోవారు అదే కలం పేరుతో రచనలు కొనసాగించక తప్పదు. అప్పుడు వచ్చిన రచనలు పేలవంగా ఉంటే, చనిపోయిన వ్యక్తి గొప్పదనాన్ని ప్రస్తుతించడం ఎక్కువవుతుంది. ఒకే కలం పేరుతో రాసే దంపతులకు కూడా ఇదే వర్తిస్తుంది. దంపతుల పొజిషన్‌ను బట్టి సాహిత్యలోకం ఇచ్చే గౌరవంలో హెచ్చుతగ్గులు వుంటాయి. ఎక్కువ ప్రచారంలోకి వస్తే వచ్చే ఇబ్బందే ఇది. తిరుపతిరావు చనిపోయిం తర్వాత 'సతి' కలం మూగబోయిందని ఎవరో అన్నారని సత్యవతి

తనమార్గం
రచన : అబ్బూరి ఛాయాదేవి
వెల : రూ. 100/-,
ప్రతులకు :
వై.నిర్మల,
హెచ్.ఐ.జి.-2,
బి12, ఎఫ్-1,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-44

అస్త్రసన్యాసం చేయటం కాదు. ఇలాంటి విమర్శలకు మళ్ళీ ఆమె తన రచనలతోనే బుద్ధి చెబితే బాగుండేది. రచయిత్రి సూచించకపోయినా ఆ జంట రచయితలెవరో పాఠకుడికి ఇట్టే అర్థమైపోతుంది. ఆఫీసుల్లో పనిచేసే అమ్మాయిల మీద కొనసాగే లైంగిక వేధింపులను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథ "కర్త, కర్మ, క్రియ." అధికార వర్గంలోకి చేరేసరికి అధికారులకు ఉపయోగకరంగానూ, లాభదాయకంగానూ ఉండాలనే తప్ప వర్కర్స్ అవసరాల గురించి ఆలోచనలు రాకపోవడాన్ని 'మార్పు' తెలియజేస్తుంది.

పిల్లల క్షేమం కోరే తల్లిదండ్రులు వర్ణాంతర వివాహం గురించిన ప్రసక్తి రాగానే తమ మాటే వినాలని పట్టుబట్టడంలో వారి ఆధిక్యతాభావనే కనిపిస్తుంది. అలా కాకుండా పెద్దలు తెచ్చిన మంచి సంబంధమైనా తమ అభిప్రాయాలు కలవకపోతే వివాహం చేసుకోవడం అవివేకమనే 'నిర్ణయాన్ని' 'స్థాన మహిమ' కూడా తెలియజేసినా, ఈ కథలో స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే అవకాశవాద ప్రేమల గురించి కూడా తెలియజేశారు. పెళ్లయింతర్వాత అనవసరంగా పాత ప్రియుడితో పరిచయం పెంచుకొని, తీరా వాడు పెళ్లి చేసుకుందాం అనేసరికి 'గతాన్ని తవ్వకు' అని బాధపడిపోవడం, అనవసర స్నేహాల వల్ల వచ్చే అనర్థాలను తెలియజేస్తుంది. పెళ్ళితో స్త్రీ తన స్వంత అభిప్రాయాలను, వ్యక్తిత్వాన్ని కోల్పోయి భర్తకు 'ఉపగ్రహం'గా మారిపోవాల్సిందేనా? అలా ఎంత అణగిమణిగి వున్నా, ఎన్ని ఏళ్లు వచ్చినా వివాహబంధం యొక్క పటిష్టత అలాగే కొనసాగుతుందా అనేది కూడా ప్రశ్నార్థకమే. వృద్ధాప్యంలో పిల్లల చుట్టూ అల్లుకున్న మమతానురాగాలను అక్కరలేని తీగలా వదిలించుకోవచ్చునేమోననే భయం 'ఉడ్‌రోజ్'లో కనిపిస్తుంది. వృద్ధాప్యంలో నిస్సహాయంగా మంచంలో పడివున్న ఆ వ్యక్తి మనసులో దాగిన ప్రేమను 'స్పర్శ' ద్వారా గుర్తించడం మన హృదయాలను కదిలిస్తుంది. వృద్ధులైన తల్లిదండ్రుల అవసరాలను పిల్లలు పట్టించుకోరు. ముసలితనం పైబడినా ఇంకా భర్త, పిల్లల అజమాయిషీలోనే స్త్రీ ఉండాల్సి రావడం అన్యాయం. వృద్ధాప్యంలో తల్లి ఆడపిల్లకయినా, మగపిల్లవాడికయినా గుదిబండగా మారడం కంటే స్వతంత్రంగా బతకాలని నిర్ణయించుకున్న కథలు రెండు వున్నాయి.

'ఎవరి ఏడుపు వారిదే' అయినా "నలుగురి కోసం" కొన్ని మర్యాదలు పాటించక తప్పదని లోకరీతిని తెలియజేసే కథలు ఇందులో మూడు వుండగా, రచయిత్రికి పిల్లల పెంపకం మీదగల అనురాగాన్ని 'బ్రహ్మాస్త్రం' కథ చిత్రీకరించగలిగింది. దోపిడి స్వభావాన్ని వివరించే కథ "అవకాశం" కాగా, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడిని ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథ 'ఆఖరుకి అయిదు నక్షత్రాలు'. ఇలా స్త్రీ సమస్యల గురించి వివరించినా, దోపిడీ స్వభావాన్ని తెలియజేసినా ఆయా కథలలో రచయిత్రి విలక్షణమైన స్వంతముద్ర కనబడుతుంది. లోకరీతిని తెలియజేసే కథలలో, అక్కడక్కడా కథలలో కనిపించే సునిశిత హాస్యం, వ్యంగ్యం మనల్ని ఆకట్టుకుంటాయి. 1965–2001 మధ్యకాలంలో వచ్చిన ఈ కథలన్నింటిని కాలక్రమానుగుణంగా అచ్చువేయడం వల్ల, రచయిత్రి యొక్క క్రమ వికాస పరిణామాన్ని అంచనా వేయడానికి ఈ కథలు దోహదపడతాయి.

-కె.పి.అశోక్‌కుమార్

స్వీకారం

నేను కనిపించే పదం
రచన : కల్పనా రెంటాల
వెల : రూ. 25/-,
ప్రతులకు : విశాలాంధ్ర, బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, పల్లవిపబ్లికేషన్స్ విజయవాడ, కల్పనా రెంటాల, 3-403, సోమ్‌నాథ్ నగర్, అనంతపురం.

ఇందులోని కవితలు ఉదయం, ఆంధ్రజ్యోతి, వార్త, సుప్రభాతం, ప్రజాతంత్ర వంటి వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. 21 కవితలలో ఈ సంకలనాన్ని వెలువరించారు.

తొవ్వ
రచన : అన్నవరం దేవేందర్
వెల : రూ. 15/-, ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్

తొమ్మిదేళ్ళ శిక్ష విధించగా వీరికి మాత్రం ఏడేళ్ళ శిక్ష విధించింది.

ఇక సాక్ష్యాన్ని పరిశీలించి చూసి మృతురాలి అత్తమామలు దోషులా? నిర్దోషులా? అన్నది నిర్ధారించాలి. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వీరు ఇరువురూ తమ కోడలు చనిపోవడానికి ముందు వరకట్నం కోసం వేధించినట్టుగా ఎక్కడా లేదు. మృతురాలి తల్లిదండ్రులు, ఇతర సాక్షులు కోర్టులో చెప్పిన సాక్ష్యం ప్రకారం వీరు ఇరువురిపై అలాంటి సాక్ష్యం లేదు. తమ కోడలు సుధామాదేవిని ఆమె చనిపోవడానికి కొద్ది రోజుల ముందు కట్నం కోసం వేధించినట్టుగా ఆమె తల్లిదండ్రులు కూడా న్యాయస్థానం ముందు చెప్పలేదు. సుధామాదేవి భర్త రామ్ పుకార్ మాత్రం భార్య చనిపోవడానికి కొద్ది నెలల ముందు కట్నం కోసం హింసించినట్లు సాక్షులందరూ చెప్పారు. వీరి సాక్ష్యం ప్రకారం మృతురాలి భర్త మాత్రమే ఆమె చనిపోవటానికి ముందు ఆమెను కట్నం డబ్బుల కోసం వేధించాడు. కానీ మృతురాలి అత్తమామలు తమ కోడల్ని కట్నం కోసం వేధించినట్టు చెప్పలేక పోయారు. వారు ఏ విధంగానూ ఆమెను కట్నం గురించి అడగలేదు. కానీ కొద్దిమంది సాక్షులు ఏం చెప్పారంటే పెళ్ళి తర్వాత మృతురాలి అత్తమామలు మరికొంత కట్నం కావాలని అడిగినట్లు చెప్పారు. ఐ.పి.సి.లోని 304 బి కింద 'వరకట్న మరణం' జరిగినట్లు కోర్టులో రుజువు కావాలంటే ఇదొక్కటే సరిపోదు. "వివాహిత చనిపోవడానికి ముందు ఆమెను భర్త, అత్తమామలు లేక ఇతర బంధువులు కట్నం కోసం వేధించినట్లయితే ఆ వేధింపులను తట్టుకోలేక ఆమె చనిపోతేనే వరకట్న మరణం అవుతుంది. చనిపోవడానికి కొద్ది రోజుల ముందు కట్నం కోసం హింసించినట్లుగా రుజువు కావాలి."

కానీ ఈ కేసులో మృతురాలి అత్తమామలు దాదాపు మూడేళ్ళ క్రితం అంటే పెళ్ళి జరిగిన కొద్ది రోజులకు మరికొంత కట్నం కావాలని అడిగి ఉండవచ్చు. కానీ వారు మృతురాలు చనిపోవటానికి కొద్ది రోజుల ముందు ఆమెను వేధింపులకు గురిచేసినట్టుగా ఎలాంటి సాక్ష్యం లేదు. ఈ పరిస్థితుల్లో అత్తమామలను ఐ.పి.సి. 304 బి, 498 ఎ సెక్షన్ల కింద శిక్షించడం అన్యాయం అవుతుందని సుప్రీంకోర్టు నిర్ధారణకు వచ్చి కింది కోర్టులు విధించిన శిక్షలను రద్దు చేసింది. వారు ఏ శిక్ష కింద కూడా శిక్షార్హులు కారని వారిని నిర్దోషులుగా విడుదల చేసింది. ◆

ఎగిరే బంతి

(19వ పేజీ తరువాయి)

తీసుకెళ్లారు. అది గతంలో తామందరూ పనిచేసిన పబ్లిక్ సెక్టారే. ప్రస్తుతం త్రిపాఠి జైన్ ప్రయివేటు సెక్టార్ అయిపోయింది. అందరి కాళ్లూ చేతులకున్న గొలుసులను విప్పదీశారు. గతంలో ఎవరు ఏ పనైతే చేశారో వారి చేత ఆ పనే చేయించారు. మధ్యాహ్నం కేరియర్‌లో తెచ్చుకున్న అన్నం తిన్నారు. సాయంత్రం గంజినీళ్లు తాగారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ పని చేయించారు. మరలా అందరినీ గొలుసులతో బంధించి జైలుకు తీసుకెళ్లారు. ఆ టైంలో అందరూ అన్నం వండుకోవాలి. ఉదయం రసాన్ని వేడి చేసుకొని అన్నం తినాలి. వండుకునేసరికి పదకొండు గంటలవుతుంది. మొత్తంమీద రోజంతా పందొమ్మిది గంటలు పనిలో వుంటారు. ఎవరైనా బద్ధకించినా, పని ఎగ్గొట్టినా, ఎదురు తిరిగినా హంటర్‌తో కొడుతూ ఈటెతో శరీరంలో గుచ్చుతూ చిత్రహింసలు పెట్టేవారు. పనిచేసినందుకు రోజుకు పది రూపాయలు లెక్కకట్టి నెలకు మూడు వందలు సిగరెట్ బీడీలకుగానీ, చిరు తిండికి గానీ ఇస్తారు. నాడు ఎక్కడైతే కార్మికులుగా పనిచేశారో అక్కడే నేడు వారిని బానిసలుగా మార్చివేశారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలూ పదిరోజులపాటు జరుగుతున్న వైనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అందరూ కూడ బలుక్కొని సహాయ నిరాకరణ ప్రారంభించారు. పోలీసులు అందరినీ రెండురోజులపాటు కిరాతకంగా హింసించారు. అందరి శరీరాల నుండి రక్తం వొడులుతోంది. ఎన్ని బాధలు పెట్టినా ఏ ఒక్కరూ చలించలేదు. త్రిపాఠి జైన్ సెల్‌ఫోన్లో జిల్లా కలెక్టరుకు పరిస్థితిని వివరించారు. పది నిముషాల్లో ప్రభుత్వ పోలీసులు వ్యానుల్లో వందల మంది దిగారు. ఆ తర్వాత పది నిముషాలకు అశ్వికదళం వచ్చింది. వారి వెంట జీపులో నలుగురు ఎస్.ఐ.లతో పాటు సిఐ దిగారు.

"ఒక గంట టైం యిస్తున్నాను. సహాయ నిరాకరణ నిలిపివేయాలి. ఎవరి పనులకు వాళ్లు వెళ్లాలి. లేదా చర్యలు చాలా తీవ్రంగా వుంటాయి."

మైకులో సిఐ ఒకసారికి పదిసార్లు హెచ్చరించాడు. ఖైదీలు మాత్రం ఖాతరు చేయకుండా భీష్మించుకునే వున్నారు. సెకండ్లు పరుగిడుతుంటే నిముషాలు దొర్లి దొర్లి గంట టైము పూర్తయింది. సిఐ ఆర్డరుపై గాలిలో తుపాకులు పేలినయి. ఖైదీలు ఏమాత్రం చలించలేదు.

"నిర్దాక్షిణ్యంగా చంపేస్తాను. పనుల్లోకి వెళ్తారా వెళ్లరా?" సిఐ గర్జించాడు.

"ఎనిమిది గంటలే పనిచేస్తాం. పందొమ్మిది గంటలు చెయ్యం"

"సరైన భోజనం కాఫీటిఫిన్లు వండించి పెట్టాలి."

"అన్ని వసతులూ కల్పించాలి."

"ప్రతి నెలా మా జీతం మాకివ్వాలి" అని కార్మిక నాయకులు డిమాండ్లు ముందుకు తెచ్చారు.

"ముందువాళ్లను షూట్ చేయండి."

"సిఐ కళ్లల్లో నిప్పులు కురిశాయి. యస్ఐలు రివాల్వర్లు పేల్చారు."

"కార్మికుల ఐక్యత వర్థిల్లాలి" అని నినదిస్తూ నలుగురు నాయకులు నేల కొరిగారు.



"పోలీసు జులుం.. నశించాలి." కార్యకర్తలు నినాదాలిచ్చారు.

"నినాదాలిచ్చేవాళ్లను కాల్చేయండి. వంతపాడేవాళ్లను లాఠీలతో బాదండి. గుర్రాలతో తొక్కించండి."

సిఐ హుకుం జారీ చేశాడు. లాఠీలు కరాళ నృత్యం చేస్తున్నాయి. గుర్రాలు గుండెల మీద తంతున్నాయి. తుపాకులు పేలుతున్నాయి. నాయకులు, కార్యకర్తలు బుల్లెట్ల తాకిడికి రాలిపోతున్నారు. అరుపులు, కేకలు, ఏడుపులు, పెడబొబ్బలతో జైలు మారుమోగిపోతోంది. సుబ్రమణ్యం ఆవేశంతో వూగిపోతూ నినాదాలిచ్చాడు. గుండెల్లో తుపాకి గుండు దూసుకుపోయింది. రక్తం జివ్వున చిమ్మింది.

సుబ్రమణ్యం కెవ్వున కేకవేశాడు. అతని గుండె చిదిమినట్లయింది. తృళ్లిపడి లేచాడు. వాకిట్లో ముగ్గు వేస్తున్న మాణిక్యమ్మ ఆదుర్దాతో వచ్చి భర్తను పరామర్శించింది. తెల్లవారి బారెడు ప్రొద్దు కూడా ఎక్కింది. అరెస్టు చెయ్యటం, ప్రయివేటు జైలు కలన్నమాట. గాలికి ఆదివారం అనుబంధం పేజీలు ఎగిరెగిరి పడుతున్నాయి. అమెరికాలో ప్రయివేటు జైళ్లు అన్న హెడ్డింగు పక్కున నవ్వింది. సీలింగు ఫేన్ స్పీడుగా తిరుగుతూనే వుంది. మొద్దు నిద్రకు సిగ్గుపడి లేచి పనులు ముగించుకున్నాడు. దిగ్బంధనం కార్యక్రమానికి కుటుంబ సభ్యులందరితో బయలుదేరాడు. అందరూ యూనియన్ ఎర్రజెండాలు పట్టుకొని నడుస్తున్నారు. దారిలో ఒక స్త్రీ గొబ్బెమ్మల పేడముద్దలు గోడకేసి కొడుతోంది. ఆ పక్కనే కుర్రవాడు బంతిని గోడకేసి కొడుతున్నాడు. పేడ ముద్ద గోడకు అతుక్కు పోతోంది. బంతి గోడకేసి కొట్టే కొద్దీ విసురుగా వస్తోంది. కార్మికవర్గం పేడముద్ద కాదు, ఎగిరే బంతిలాంటి దనుకున్నాడు సుబ్రమణ్యం. ఎదురుగా గోడమీద ఆసియా సోషల్ ఫోరం వాల్‌పోస్టర్ "మరో ప్రపంచం సాధ్యమే" అంటూ సగర్వంగా చూసింది. ◆

కులమతాల కతీతంగా...

కొండబాబు

ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉండగానే ఆయా పార్టీలు సన్నాహక సభలు మొదలు పెట్టాయి. ఆ రోజు అక్కడ అలాంటిదే ఒక సభ. అధినాయకుడి ప్రసంగం మొదలైంది.

"... వచ్చే ఎన్నికల్లో ఫలానా పార్టీ పుట్టగతుల్లేకుండా పోతుంది. ఆ భయంతోనే వాళ్ళు మన పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. మనది కుల పార్టీ అట. మరి వాళ్ళ పార్టీ సంగతో? అది చూసుకోమనండి ముందర. మనది ఏ కులానికీ సంబంధించిన పార్టీ కాదు. అన్ని కులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తాం. కులమతాల తేడా లేకుండా అందరికీ టిక్కెట్లిస్తాం. కులమతాల తేడా లేకుండా అభివృద్ధి చేస్తాం..." ఇలాసాగుతూ కొంతసేపటికి ముగిసింది సభ.

ఆ తర్వాత గెస్ట్‌హౌస్‌లో అధినాయకుడితో కార్యకర్తల సమావేశం ప్రారంభమైంది.

"సార్... ఈసారి మా కులానికే సిటీ ఒన్ సీటియ్యాలి. మా కులానికి అన్యాయం జరిగితే సహించం" ఓ కార్యకర్త లేచి అన్నాడు. మరికొందరు "అవును... అవును.." అనరిచారు. వారి స్థానిక నాయకుడు మాత్రం గుంభనంగా చూస్తూ ఊరుకున్నాడు. కొద్దిసేపటికి ఒక కులసంఘం వారు వచ్చి అధినాయకుడికి ఒక వినతిపత్రం సమర్పించారు. "ఏ పార్టీ మా కులానికి ఎక్కువ స్థానాలిస్తే వారికే మా మద్దతు" అని ఉందందులో.

ఆ తర్వాత తన కుల సంఘం విఐపిల వనసమారాధనకు అధినాయకుడు బయలుదేరి వెళ్ళారు. 'అక్కడ తన, తన శతృపార్టీ, తాము మత పార్టీగా విమర్శించే పార్టీ, ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టే పార్టీ.. ఇలా అనేక పార్టీల నాయకులందరూ కలిశారు. అది అఖిలపక్షసమావేశం కాదు... అసలు రాజకీయ సమావేశమే కాదు... కానీ వారందరూ తన కులపోళ్ళు మరి... అందరూ షేక్‌హ్యాండ్లిచ్చుకున్నారు. పలకరించుకున్నారు... చెవులు కొరుక్కున్నారు.. ఇలా చాలా చేసుకున్నారు.

☆ ☆ ☆

ఇందులో ఆవగింజంత అబద్ధం లేదు. అంతా నిజమే. మీరూ ఇలాంటి సభలు, వినతులు, పిక్‌నిక్కులూ... చూసే ఉంటారు. విని ఉంటారు. లేదా పత్రికల్లో వేర్వేరు వార్తలుగా చదివి ఉంటారు. ఇలా అన్నీ కలిపి గుదిగుచ్చి మాత్రం చదివి ఉండరులెండి. అలా రాయరు కాబట్టి.

ఈ రాజకీయ గొడవలెందుకులెద్దూ! అంటారా;? అక్కడికే వస్తున్నా. రాజకీయాలు కాదు రాజకీయ పదాలు, పలుకుబడుల గురించే మన బాధంతా.

కులమతాల తేడా లేకుండా అభివృద్ధి చేస్తాం.

అన్ని కులాలకూ టిక్కెట్లిస్తాం...

మా కులానికి ఎవరు ఎక్కువ సీట్లిస్తే... వారికే మద్దతు... ఇవన్నీ వందలాది సభల్లో, పత్రికల్లో అనుభవంలోకి వచ్చే వుంటాయి. అందుకే ఈ పలుకుబడుల గురించి మాట్లాడుకుందాం.



గత వారం చెప్పుకున్న వర్గాలు, వర్గ భేదాలు గుర్తుకు తెచ్చుకుందాం. ధనిక, పేద రెండే వర్గాలని గదా చెప్పుకున్నాం. ఆ శాస్త్రీయ వాస్తవికత ఆధారంగా ఈ నాలుగు పలుకుబడులనూ పరిశీలిద్దాం.

సమాజంలో కులభావన బలంగానే ఉంది. రాజకీయ నాయకులకూ ఉందని బాధ్యత కలిగిన ఆ నాయకులు పరస్పరం చేసుకునే విమర్శల వల్లే తేటతెల్లమవుతోంది. కాబట్టి వారు కులమతాల తేడా లేకుండా ఎలా అభివృద్ధి చేస్తారు? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కాని అభివృద్ధి చేస్తారన్న మాట నిజమే. పాలకవర్గం ఎప్పుడూ తన వర్గం అభివృద్ధినే కోరుతుంది. ధనిక వర్గమే అది. ఏ కులంలోనైనా ధనిక వర్గానికి అనుకూలంగానే వ్యవహరిస్తుంది. పాలన చేస్తుంది. అదే కులమతాలకతీతంగా అంటేనూ మతంలోనూ అంతే. అన్ని కులాలకూ టిక్కెట్లిస్తామనడంలోనూ ఆయా కులాల్లోని ప్రతిభావంతులకు కాక ధన ప్రాబల్యమున్న వారికే ఇస్తారు. వారు లేనప్పుడు తమ ప్రాబల్యం కింద పని చేసే వారికిస్తారు. 'మా కులానికే సీటివ్వాలి' అనే డిమాండ్లతో సాగే ఆందోళనలను, వాటిని ప్రోత్సహించే నాయకులు, పార్టీలు, సంఘాల ఆంతర్యమూ అంతే. ఆయా కులాల్లోని ధనిక, పాలకవర్గ ప్రాబల్యం కింద పని చేసే వారికే టిక్కెట్లివ్వాలి. ఇవ్వడమూ అంతే.

'ఎవరెక్కువగా మా కులానికి టిక్కెట్లిస్తే వారికే మద్దతు' అనడంలోనూ... పాలకవర్గ స్వభావమున్న తమ కులంలోని ఎక్కువ మందికి అవకాశమివ్వాలని కోరడమే. ఇందులో విధానాల ప్రస్తావన లేకపోవడం గమనించాలి.

వీటన్నిటిలోనూ ఉన్న ఒక అంశాన్ని మనం గుర్తించాలి. కులం పేరిట టిక్కెట్లు, సీట్లు, పదవులు ఇస్తామనడమూ, కోరడమూ రెండూ ఒకే విధమైనవి. వాటివల్ల ఆయా కులాల్లోని పేదలకు ఒరిగేదేమీ ఉండదు. పదవులు పొందిన ఆ వ్యక్తుల కుటుంబాలు తప్ప. వారు చేయగలిగిందేమీ కూడా ఉండదు. ఆయా పార్టీల విధానాలే అలాగ ఉంటాయి. రిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటాయింపు ఉండకూడదని కాదు దీని అర్థం. ఇవ్వాల్సిందే. కానీ ఈ ప్రగల్భాలు, పిలుపులూ, పలుకుబడుల వెనుకుండేవి మాత్రం ఇవి.

వాస్తవం చూస్తే, కులాలతో సంబంధం లేకుండా అన్ని కులాల్లోని పేదలను అభివృద్ధి చేయాలనే విధానాలున్న పార్టీలు మాత్రమే నిజంగా అభివృద్ధి చేయగలవు - ఆ ప్రతినిధి ఆ కులం వాడు అయినా కాకపోయినా. అంటే ఎక్కడ నుంచి వచ్చామన్నది కాదు ఏ వర్గం కోసం పని చేస్తున్నామన్నదే మనం చూడాలి. అలా చూసినప్పుడు ఈ కులమతాల కేటాయింపుల వలలో పడకుండా ప్రజలందరూ వాస్తవంగా తమ అభివృద్ధి కోసం విధానాలున్న పార్టీలను ఎన్నుకునే చైతన్యం కలిగి ఉంటాయి. ఇందుకోసమే ఈ కులాల పలుకుబడులను కూలంకషంగా తెలుసుకోవలసిన అవసరముంది. ◆

పాఠక స్పందన

చారిత్రక విషయాలు బాగుంటున్నాయి

ఆదివారం అనుబంధంలో టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురిస్తున్న చారిత్రక విషయాలు బాగుంటున్నాయి. జనవరి 19వ తేదీ సంచికలో ప్రచురించిన డిచ్‌పల్లి రామాలయం గురించిన సమాచారం బాగుంది. ముఖ్యంగా ఈ శీర్షిక ద్వారా అనేక చారిత్రక విషయాలను, కట్టడాలను గురించి తెలుసుకుంటున్నాం. వాటిని సందర్శించలేకపోయినా ఈ వ్యాసాలను చదివినప్పుడు సందర్శించిన అనుభూతి కలుగుతోంది.

- ఎ.శశికిరణ్, రాగంపేట, కరీంనగర్

మండుతున్న ధరలు

జనవరి 19వ తేదీ సంచికలో జీవనశైలి శీర్షికన ప్రచురించిన 'ధరలు...ధరలు...' చాలా బాగుంది. ఒక్క బియ్యం ధరే కాక మానవుని ఆకలిని తీర్చే నిత్యావసర వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోతున్నాయి. అదే సమయంలో ధనిక వర్గాలకు ఉపయోగపడే విలాస వస్తువుల ధరలు తగ్గిపోతున్నాయి.

- దాసరి శ్రీనివాస్, పాపన్నపేట, మెదక్

క్షీణిస్తున్న సంక్రాంతి శోభ

జనవరి 12వ తేదీ సంచికలో ప్రచురించిన కవర్ స్టోరీ సంబరాల సంక్రాంతి విశేషాలు బాగున్నాయి. పల్లెల్లో సంక్రాంతి జనజీవన స్రవంతిలో భాగమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ శోభ క్షీణించిపోవడం దురదృష్టకరం. రైతుల పండుగగా పేరెన్నికగన్న ఈ పండుగ మాదిరిగానే వివిధ దేశాల్లో జరుగుతున్న పండుగల గురించి సమగ్ర సమాచారం ఇచ్చారు.

- మంకుశ్రీను, కొప్పర్రు. ప.గో. జిల్లా.

- దూపకుంట్ల నాగేంద్రరావు, గంపలగూడెం, కృష్ణాజిల్లా